ఎనిమిది కుర్చీలు

వసుంధర

అక్కడ మొత్తం ఎనిమిది కుర్చీలలో ఎనమందుగు రున్నారు.

ప్రముఖ సినిమా నటుడు వీరేశం, క్రికెట్ ఆటగాడు రమేష్, పారిశ్రామికవేత్త హరగోపాల్, న్యాయవాది చంద్రశేఖరం, రాజకీయ నాయకుడు గోవిందయ్య, కాలేజీ ప్రిన్సిపాల్ నరహరి, డాక్టర్ మోహనరావు, రచయిత శ్రీనివాసరావు వున్నారక్కడ.

వీళ్ళు ఎనమందుగురూ సమ వయస్కులు. చిన్ననాటి స్నేహితులు. అంతా నలభైలోపు వయసువాళ్ళు. తమ తమ రంగాల్లో బాగా పేరు ప్రఖ్యాతులు సంపాదించు కున్నవారు.

పార్టీ గోవిందయ్య ఏర్పాటు చేశాడు. రానున్న బై ఎలక్షన్‌లో ఆయనకు అధికార పార్టీ టికెట్ లభించింది.

పార్టీ ఖరీదుగానే వుంది. విందులో మందు కూడా వుంది.

"మనది అరుదైన స్నేహం—చిన్నతనంనుంచీ కూడా సంతోష సమయాల్లో ఇలా కలుసుకుంటూనే వున్నాం" అన్నాడు కోన్యాక్ చప్పరిస్తూ శ్రీనివాసరావు.

"ఇలాగే యింకా యింకా కలుసుకుంటాం—" అంటూ చంద్రశేఖరం టేబిల్ మీద చార్మినార్ పెట్టి తీశాడు.

ఆ పార్టీలో అదొక్కటే చవకైనది. అందుకు కారణం వుంది. చిన్నతనంలో మొదటిసారిగా ఈ ఎన మండుగురూ దగ్గరగా వచ్చినపుడు కాల్చినవి చార్మినార్ సిగరెట్లు. ఆ తర్వాతనుంచి ప్రత్యేకమైన వేడుక సమయాల్లో కలుసుకున్నప్పుడు చార్మినార్ తాగడం సంప్రదాయంగా మారింది.

ఎనమండుగురూ కూడా ఒకప్పుడు సాధారణ మధ్య తరగతి కుటుంబాలకు చెందినవారే! ఆ స్థాయినుంచి ఈ స్థాయికి ఎదగడానికి వాళ్ళు చేసిన కృషిలో నేరాలు, ఘోరాలు కూడా వున్నాయి. అలాంటివాట్లలో ఒకో సారి పరస్పర సహాయం చేసుకోనడం కూడా జరిగింది.

చంద్రశేఖరం సిగరెట్ తీసి వెలిగించి పక్కవాడికి తోశాడు. ఒక్కొక్కటే సిగరెట్ వెలిగించుకున్నారు.

"పార్టీలో ఇదేగా ఆఖరి అయిటం—" అన్నాడు గోవిందయ్య.

"మనకు పెళ్ళిళ్ళు కావడమేకాక — మన పిల్లలు పెళ్ళిడుకొస్తున్నారు. ఆఖరి అయిటం ఇంకా ఏదో వుంటుందని ఎలాగనుకుంటాంలే—" అన్నాడు వారగోపాల్.

"ఆఖరి అయిటం అనగానే మళ్ళీ ఎప్పుడో ఇలా కలుసుకోవడం అనిపిస్తోంది—" అన్నాడు మోహనరావు.

"అవకాశముంటే వీరేశానికో, రమేష్‌కో, చంద్రశేఖరానికో వుంది. ఇంకెవ్వరికీ లేదు—" అన్నాడు ప్రిన్సిపాల్ నరహరి.

"ఈ రోజుల్లో హీరోలకేగానీ క్యారెక్టర్ యాక్టర్లకి బహుమతులుండటం లేదు. అందువల్ల నాకే అవకాశమూ లేదు—" అన్నాడు సినీ నటుడు వీరేశం.

"నాకు కెరీర్ ముగుస్తోంది. ఇంక టెస్టు సెలక్షన్ వచ్చే అవకాశం లేదు. వున్నదల్లా చంద్రశేఖరానికే వుంది—" అన్నాడు క్రికెట్ ఆటగాడు రమేష్.

"ప్రస్తుతం ఓ ఇంట్రస్టింగు కేసు చేతిలో వుంది. బహుశా మనం మళ్ళీ కలవచ్చు—" అన్నాడు న్యాయవాది చంద్రశేఖరం.

"ఏమిటా కేసు!" మిగతా అందరూ ఆసక్తిగా అడిగారు.

"పార్టీలో కలిసినపుడు చెబుతాను—" అన్నాడు చంద్రశేఖరం.

పార్టీ అయిపోయింది. అంతా ఒక్కొక్కరే వెళ్ళిపోయారు. గోవిందయ్య అందరికీ గుడ్ నైట్ చెప్పి తన పడగ గదికి వెళ్లాడు. అతడి భార్య జానకి అప్పటికే నిద్రపోతోంది. పక్కమీద అలికిడి కాగానే ఆమె మత్తుగా కళ్ళు విప్పి—"పార్టీ అయిపోయిందా?" అంది.

"అయిపోయింది. అప్పుడే నిద్ర పట్టేసిందా?" అన్నాడు గోవిందయ్య.

"పిల్లలైతే ఎప్పుడో నిద్రపోయారు. నేనే ఇప్పుడిప్పుడే నిద్రపోయినట్లున్నాను—" అంటూ ఆవలించింది జానకి.

గోవిందయ్య లుంగీ తీసుకుని పాంటు విప్పాడు.

విప్పడంలో అందులోంచి ఓ కవరు క్రిందపడింది. ఠప్ మని చప్పుడయింది.

"ఏమిటా చప్పుడు?" అంది జానకి.

"ఏదో కవరు—" అంటూ గోవిందయ్య యధాలాపంగా ఆ కవరు అందుకున్నాడు. తెల్లటి కవరు అది. దానిమీద తన పేరే రాసివుంది. గోవిందయ్య కవరు అటూ ఇటూ తిప్పి చూశాడు. అతికించే వుంది. అతికించిన కవరు తన జేబులోకి ఎలా వచ్చిందోనని ఆశ్చర్య పడుతూ గోవిందయ్య అది చింపి లోపలి కాగితం బైటకు తీశాడు. తెల్లటి కాగితంమీద ఎర్రటి అక్షరాలు.

"గోవిందయ్యా! చార్మినార్ సిగరెట్ పెట్టెలో ఎనిమిది సిగరెట్లున్నాయి. వాటిలో ఒకటి విషపూరితం. తెల్లారేలోగా మీలో ఒక్కరుండరు. తర్వాత పార్టీకి పాపం ఏడుగురే వుంటారు—"

అని వ్రాసి వుంది. సంతకం లేదు.

"ఇంకా పడుకోలేదా?" అంది జానకి. సమాధానంగా ఆమెకి ధబ్ మన్న శబ్దం వినపడింది.

"ఏమిటండీ అది!" అంది జానకి కంగారుగా. సమాధానంలేదు. జానకి కళ్ళు నులుముకుని లేచి వచ్చేసరికి అక్కడ గోవిందయ్య స్పృహతప్పి పడివున్నాడు.

2

గోవిందయ్య ఫామిలీ డాక్టరు వచ్చి చూసేసరికి ఆయన చచ్చిపోయాడు. డాక్టరు కొన్ని పరీక్షలు చేసి— అది సహజ మరణమని తేల్చి చెప్పాడు. గోవిందయ్య చేతిలోని ఉత్తరం చూసి-"ఇది పోలీసులకి స్తే మంచిదే! కానీ దానివల్ల చాలా ఇబ్బందులూ వున్నాయి—" అన్నాడాయన.

ఫామిలీ డాక్టరు సలహామీద గోవిందయ్యకు వచ్చిన ఉత్తరం గురించి ప్రత్యేకమైన రిపోర్టు ఏమీ ఇవ్వలేదు జానకి. ఆ విషయాన్ని కుటుంబ సభ్యులు తమలో తాము ఇముడ్చుకున్నారు.

పార్టీకి వచ్చిన గోవిందయ్య మిత్రుల్లో ఒక్కరుకూడా అతడి శవాన్ని చూడ్డానికి రాలేదు. అందరూ రాత్రికి రాత్రే స్వంత కార్లలో ఆ ఊరు వదిలి వెళ్ళిపోయారు. వాళ్ళలో ఏ ఒక్కరూ ఆ ఊరివారు కాదు.

భర్త మరణవార్త ఈ స్నేహితులకు తెలియ జెయ్యాలా మానాలా అని ఆలోచించింది జానకి. చివరకు ఊరుకుంది. ఎందుకంటే ఈ స్నేహం పూర్తిగా భర్తకూ, వారికీ పరిమితం. తన భర్తతోపాటే స్నేహమూ అయి పోయినట్టే!

గోవిందయ్య అంత్యక్రియలు జరిగిపోయాయి ఎంతో వైభవంగా! ఎందరో ప్రముఖులు సంతాపాన్ని వ్యక్త పరుస్తూ టెలిగ్రాములు పంపారు. గోవిందయ్యకు రావలసిన పార్టీ టికెట్ మరో జనార్దనమూర్తికి వెళ్ళింది. అతడోసారి జానకి ఇంటికి వచ్చి — "పార్టీ టికెట్ కోసం ఎంతోకాలంగా ప్రయత్నిస్తున్నాను. కానీ అది ఇలా రావటం నాకెంతో బాధగా వుంది—" అని చెప్పాడు.

బాధగా వున్నప్పటికీ జనార్దనమూర్తి పార్టీ టికెట్ తనకు వచ్చినందుకు విందులు ఏర్పాటు చేశాడు. ఎన్నికలు రాగానే ముమ్మరంగా ప్రచారమూ ప్రారంభించాడు. ఆ కోలాహలం చూసినపుడల్లా జానకికి ఎంతో బాధగా వుండేది. బ్రతికి బాగుంటే ఆ కోలాహలమంతా తన భర్త పేరున జరగాల్సి వుంది.

ఎన్నికలు ముగిశాయి. జనార్దనమూర్తి పదివేల మెజారిటీతో నెగ్గాడు. ఊరంతా పెద్ద ఊరేగింపు. ఊరేగింపు చూసి జానకి కళ్ళనీరు పెట్టుకుంది.

ఆ మర్నాడే గోవిందయ్యా పేరిట ఓ కవరు వచ్చింది. తన భర్త పేరుమీద ఉత్తరం వచ్చినందుకు ఎంతో ఆశ్చర్యపడిన జానకి అది విప్పి చదివింది.

అది న్యాయవాది చంద్రశేఖరంనుంచి వచ్చింది.

"మిత్రమా గోవిందయ్యా!

అనుకున్నట్లుగానే నేను పార్టీ యిస్తున్నాను. ఈ పార్టీకి నువ్వు రాలేవని నాకు తెలుసు. అయినా అది నా లోపంకాదు. నేను బ్రతికున్నంత కాలం నీ పేరున ఆహ్వానం పంపిస్తూనే వుంటాను. తప్పక వస్తావు కదూ— ...."

క్రింద పార్టీ తేదీ వివరాలున్నాయి.

ఈ ఉత్తరం చదవగానే జానకి బుర్ర చురుగ్గా పని చేసింది. ఇలాంటి పార్టీలో ఓ సిగరెట్ త్రాగి తన భర్త ప్రాణాలు కోల్పోయాడు. అది హత్య అవునో కాదో తెలియదు. కానీ ఈ విషయం ఆ పార్టీలోని మిగతా సభ్యులకు తెలియడం ఎంతైనా అవసరం.

జానకి వెంటనే చంద్రశేఖరానికి గోవిందయ్యా పేరు మీదనే టెలిగ్రాం ఇచ్చింది — పార్టీకి తను బయల్దేరి వస్తున్నట్లు.

3

ఈ టెలిగ్రాం అందుకుని చంద్రశేఖరం చాలా ఆశ్చర్యపడ్డాడు. గోవిందయ్యా పోయినట్లు తను పత్రికల్లో చూశాడు. సంతాపం తెలియచేస్తూ టెలిగ్రాం కూడా కొట్టాడు. మరి ఈ టెలిగ్రాం ఎవరిచ్చారు?

చంద్రశేఖరం ఏర్పాట్లన్నీ ఏడుగురికే చేశాడు. పార్టీ కోసం ఓ గదిని ప్రత్యేకించాడు. రాత్రి ఎనిమిది దాటినాక ఇంట్లోని ఎవ్వరూ కూడా అటువైపు రాకూడదని శాసించాడు. టైముకి ఒక్కొక్కరే రాగానే అందర్నీ తను ఆప్యాయంగా రిసీవ్ చేసుకుని గదిలోనికి తీసుకుని వెళ్ళాడు. అంతా వాళ్ళ వాళ్ళ సీట్లలో కూర్చున్నారు.

"కుర్చీలు ఏడే వున్నాయి—" అన్నాడు హరగోపాల్. ఆయన ముఖంలో బాధ కనబడింది—"కుర్చీలు తగ్గేటంత వయసు మనకు లేదు—"

"ప్లీజ్ — ఇది మనం సంతోషంగా గడుపవలసిన సమయం—" అన్నాడు చంద్రశేఖరం.

"విషాదాంశాలను స్మరించను కూడా స్మరించకూడదు—"

అంతా కొద్ది క్షణాలు నిశ్శబ్దంగా అయిపోయారు. అది వారి పార్టీ నియమం. అక్కడున్నంతసేపూ ఉత్సాహమైన కబుర్లే చెప్పాలి.

"నిజానికి ఈ కేసు నేను నెగ్గుతానని అనుకోలేదు. అంతవరకూ వ్యతిరేకంగా వున్న సాక్షి ఒకడు మాకు అనుకూలంగా మారిపోయాడు. దాంతో కేసు తిరిగిపోయింది. నేను రక్షించినది సామాన్యుణ్ని కాదు. ఫీజుగా నాకు లక్ష రూపాయలు వచ్చింది—మన పార్టీకి ఇంతకంటె అనుకూలమైన పరిస్థితి ఏముంటుంది?" అన్నాడు చంద్రశేఖరం.

"కేసు వివరాలు చెప్పాలి!" అన్నాడు మోహనరావు.

"చెబుతాను. ముందు కడుపులు నింపాలి గదా!" అన్నాడు చంద్రశేఖరం.

అంతా ఉత్సాహంగా అక్కడున్న పదార్థాలమీద పడ్డారు. ముందు ఓ రౌండ్ ముందు కొట్టారు. తర్వాత చికెనూ, మటనూ లాగించారు. అప్పుడు మళ్ళీ మందు కొట్టటం మొదలుపెట్టారు.

టేబిల్ కు మధ్యలో ఓ చార్మినార్ సిగరెట్ పెట్టె వున్నది. అది కొద్దిగా తెరిచి వుంది. అందులో ఏడు సిగరెట్లున్నాయి.

చంద్రశేఖరం చెప్పడం మొదలుపెట్టాడు.

"హంతకుడు మధ్యతరగతివాడు. పదిమంది అతడిమీదే ఆధారపడి జీవిస్తున్నారు. హంతకుడి చెల్లెలికి పెళ్ళి కుదిరింది—కట్నం లేకుండా! అలాంటి పరిస్థితుల్లో ఓ కోటీశ్వరుడి కొడుకు హంతకుడి చెల్లెలిని రేప్ చేయబోతూండగా హంతకుడు కలగజేసుకున్నాడు. గొడవలో హత్య జరిగింది. హత్య జరిగిన కొద్ది క్షణాలలో నే హంతకుడు తండ్రిని కలుసుకుని జరిగింది చెప్పాడు. తండ్రి నా దగ్గరకు వచ్చాడు.

హత్య గురించి పోలీసులకు ఫిర్యాదు వెళ్ళేలోగా మేము హంతకుడి కుటుంబాన్ని కలుసుకుని వాళ్ళ కష్టాలన్నీ తీరుస్తామని వాగ్దానం చేశాం. ఈ మధ్యతరగతివాళ్ళతో ఇదో పెద్ద న్యూసెన్సు. డబ్బు కోసం నానా గడ్డి కరుస్తూనే-నిజంగా డబ్బొచ్చేసరికి సెంటిమెంట్లు పెంచుకుంటారు. హంతకుణ్ని ఉరికంబమెక్కించి తీరుతామని వాళ్ళు ప్రతిన బూనారు. కేసు పోలీసులకు వెళ్ళింది. ఇలాంటి వాళ్ళంటే సానుభూతి వున్న లాయరు వాళ్ళ కేసు టేకప్ చేసి బలంగా తయారుచేశాడు.

నా శాయశక్తులా ఉపయోగించాను. మనసులో ఆశ లేదు. ఆ సమయంలో ఓ సాక్ష్యం నా వైపు తిరిగింది,

ఫలితంగా తేలిందేమిటంటే హతుడి చెల్లెలికి హంతకుడితో అక్రమ సంబంధమున్నదనీ అది తెలిసి హతుడుద్రేకపడి చెల్లెల్ని చంపేయబోయాడనీ — ఆమెను రక్షించడంలో హంతకుడు ప్రమాదవశాత్తూ హత్య చేశాడనీ! ఇది ఋజువు కావటంతో నే నా క్లయింట్ని వదిలేశారు. హతుడి కుటుంబం ఇంకా కష్టాల్లో పడింది. అంతవరకూ లేని మరో చెడ్డ పేరు హతుడి చెల్లెలికి వచ్చింది — ఏమైతేనేం — నాకు లక్ష రూపాయలూ వచ్చాయి—" అన్నాడు చంద్రశేఖరం గర్వంగా.

చంద్రశేఖరం తెలివికి మిత్రులంతా అభినందించారు. "ఇదే విధంగా నువ్వు మరిన్ని లక్షలు సంపాదించాలని కోరుచున్నాము —" అని అంతా ఏక కంఠంతో అన్నారు.

శ్రీనివాసరావు టేబిల్ మీద చార్మినార్ సిగరెట్ పెట్టె తీశాడు. అందులోంచి ఓ సిగరెట్ తీసి వెలిగించి-పెట్టె పక్కవాడికి తోశాడు. ఒక్కొక్కరే సిగరెట్ వెలిగించారు.

"పార్టీలో ఇదే ఆఖరి అయిటం—" అన్నాడు వీరేశం.

"మళ్ళీ పార్టీ ఎవరు చేస్తారో?" అన్నాడు నరహరి.

"నా ఆశలన్నీ వీరేశంమీదా, శ్రీనివాసరావుమీదా వున్నాయి. ఇద్దరికీ మంచి గుర్తింపు పొందే అవకాశం వుంది—" అన్నాడు హరగోపాల్.

"అలా ఏమీ చెప్పలేము. పార్టీ చేసే అవకాశం మనలో అందరికీ ఏదో విధంగా రావచ్చును-" అన్నాడు శ్రీనివాసరావు.

సిగరెట్ ఆఖరి దమ్ము లాగటం అయిపోగానే అంతా

లేచారు.

అందర్నీ పంపించడం అయినాక చంద్రశేఖరం లోపలకు వెళ్ళబోతూంటే వాచ్‌మన్ — "సార్!" అన్నాడు.

"ఏం?" అన్నాడు చంద్రశేఖరం వెనక్కి తిరిగి.

"మీ పార్టీ అవుతూండగా ఒకామె వచ్చిందండి. తన పేరు జానకి అని చెప్పింది. పార్టీలో వుండగా తమరెవ్వరినీ కలుసుకోరని చెప్పాను. తనూ పార్టీ పనిమీదనే వచ్చానని చెబుతూ ఆహ్వాన పత్రం కూడా చూపిందామె. సరేనని లోపలకు వెళ్ళనిచ్చాను. ఆమె లోపలకు వెళ్ళి పది నిమిషాల్లో వెనక్కి తిరిగి వచ్చేసింది. మిమ్మల్ని కలుసుకున్నారా అంటే లేదని చెప్పింది. కాసేపు ఆగుతారా అంటే ఆగనని చెప్పింది. ఇలా వచ్చి వెళ్ళినట్లు అయ్యగారికి చెప్పాలా అంటే అవసరంలేదంది. అంతా తమాషాగా అనిపించింది నాకు. ఎందుకైనా మంచిదని మీతో చెబుతున్నాను."

"ఆమె వయసెంతుంటుంది?"

"ముప్ఫై దాటుతుందండి. మనిషి చాలా అందంగా ఉందండి—"

"అలాగా-" అని వెనక్కి తిరిగాడు చంద్రశేఖరం.

జానకి—ఎవరామె? ఇలాంటి పేరు తనెక్కడా వినలేదు. ఆమె కూడా ఆహ్వాన పత్రం కూడా తీసుకుని వచ్చిందంటున్నాడు. అదెక్కడిదామెకు?

తను మొత్తం ఎనిమిది ఆహ్వాన పత్రాలు పంపాడు. పార్టీకి ఏడుగురు వచ్చారు. ఒక ఆహ్వాన పత్రం గోవిందయ్యది.

జానకి ఎవరో చంద్రశేఖరానికి గుర్తొచ్చింది. జానకి

గోవిందయ్య భార్య పేరు. తన ఆహ్వానాన్నందుకుని ఆమె గోవిందయ్య పేరున టెలిగ్రాం ఇచ్చిందా? గోవిందయ్యకు బదులు తను పార్టీకి రావాలనుకుని చివరి క్షణాల్లో మనసు మార్చుకుందా? అలా మనసు మార్చుకునే సంఘటన ఏం జరిగింది?

ఆలోచిస్తూనే చంద్రశేఖరం లోపలకు నడిచాడు. పార్టీ జరిగిన గదిపక్కనుంచి నడుస్తూండగా—"చంద్రశేఖరం—" అని ఎవరో లోపల్నుంచి పిలిచినట్లు వినిపించిందతడికి. చటుక్కున అతను ఆ గదిలోకి వెళ్లాడు.

ఇప్పుడక్కడ ఏడు కాదు—ఎనిమిది కుర్చీలున్నాయి.

"నేను రాననుకుని నా కోసం నువ్వు కుర్చీ వేయించలేదు. అందుకని నా కుర్చీ నేనే తెచ్చుకున్నాను—" అన్నాడు ఎనిమిదో కుర్చీలో కూర్చున్న గోవిందయ్య.

గోవిందయ్యను చూస్తూనే చంద్రశేఖరం—కెవ్వుమని అరిచాడు.

4

"ప్రముఖ న్యాయవాది చంద్రశేఖరం హఠాన్మరణం" అన్న వార్త చూసి స్తబ్ధురాలైంది జానకి. పేపర్లో వార్తనామె ఎంతో శ్రద్ధగా చదివింది. అందులో ఎక్కడా అది హత్య అన్న సూచన లేదు.

మొత్తం వాళ్ళు ఎనమండుగురు స్నేహితులు. గోవిందయ్య వాళ్ళకు తనింట్లో పార్టీ యిచ్చాడు. చార్మినార్ సిగరెట్ పెట్టెలో ఎనిమిదింట్లో ఒకటి విషపూరితం అన్న హెచ్చరిక గోవిందయ్యకు అందింది. గోవిందయ్య చనిపోయాడు. తర్వాత మళ్ళీ పార్టీ జరిగింది. ఈసారి చంద్రశేఖరం పార్టీ యిచ్చాడు. తను వెళ్ళి అతణ్ని సిగరెట్ల విషయమై హెచ్చరించాలనుకుంది.

వెళ్ళింది కూడా!

అయితే చంద్రశేఖరం ఏ సందర్భంలో తనా పార్టీ యిస్తున్నాడో స్వయంగా చెబుతూండగా వింది. అతను నేరస్తుణ్ని కాపాడి అమాయకులకు కష్టం కలిగించాడు. ఆ విజయాన్ని పురస్కరించుకుని పార్టీ చేస్తున్నాడు. పార్టీలో ఒక్కరు కూడా అది అన్యాయమనలేదు. అంతా అతడి విజయాన్ని హర్షించారు. ఎందుకో ఆ క్షణంలో తనకు వాళ్ళని హెచ్చరించాలనిపించలేదు. కానీ అందు మూలంగా ఘోరం జరిగిపోయింది. మరో కడికి అకాల మరణం సంప్రాప్తించింది.

హంతకుడు ఈ ఎనమండుగురిలోనే వున్నాడు. వారిలో ఇద్దరు పోయారు. ఇంక ఆరుగురు మిగిలారు. ఏ ప్రయోజనాన్నాశించి హంతకుడీ హత్యలు చేస్తున్నాడు? ఇంకా అతడెన్ని హత్యలు చేయబోతున్నాడు? ఆ ఆరుగురిలోనూ హంతకుడెవరు?

జానకి ఆలోచనలు పరిపరి విధాల పోయాయి.

జానకి చదువుకున్న వనిత. భర్త పోయిన దుఃఖం నుండి ఆమె తొందరగానే తేరుకుంది. ఏ కారణంగా భర్త హత్య కావించబడ్డాడో తెలుసుకోవాలన్నది ఆమె కుతూహలం. ఆ కుతూహలంలో కొంత భయం కూడా వున్నది. హంతకుడి పగ ఒక్క గోవిందయ్యపైననో లేక మొత్తం కుటుంబం మీదనా?

చంద్రశేఖరం హత్యతో జానకికి కొంత ధైర్యం కలిగినా హత్యలకు వెనుకనున్న అసలు కారణం తెలుసుకోవాలని ఆమెకున్నది.

ఇప్పుడామెకున్న అనుమానం—మళ్ళీ మూడో పార్టీ జరుగుతుందా? ఈ పార్టీ అయ్యాక కూడా ఇంకొకరు

మరణిస్తారా?

జానకి ఆలోచనలిలా వుండగానే గోవిందయ్య పేరున ఇంకో ఆహ్వాన పత్రం వచ్చింది. అది నటుడు వీరేశం పంపాడు. అప్పటికి చంద్రశేఖరం చనిపోయి నాలుగు మాసాలవుతుందేమో!

బహుశా వీరేశానికి చావు మూడింది. అతడిని హెచ్చరిస్తే ఎలా వుంటుంది? హంతకుడు మిగతా అయిదుగురిలోనూ వున్నాడు.

అప్పుడే జానకి కింకో అనుమానం కలిగింది. రెండుసార్లు పార్టీ ఇచ్చిన వ్యక్తులే చనిపోయారు. హెచ్చరిక ప్రకారం చార్మినార్ సిగరెట్లలో ఒకటి విషపూరితం. హంతకుడు అంత ఖచ్చితంగా విషపూరితమైక సిగరెట్‌ని హతుడికెలా అందజేయగలుతున్నాడు? విషపూరితమైన సిగరెట్‌ని హంతకుడు స్వయంగా హతుడికందిస్తున్నాడా లేక పార్టీ ఇచ్చినవారే చనిపోవడమన్నది కాకతాళీయంగా జరిగిందా?

తను హెచ్చరించకపోతే వీరేశమో — మరొకడో చావడం ఖాయం. ఇప్పుడు తనేం చేయాలి? ఇంతవరకూ జరిగినది వాళ్ళకు చెప్పటం తన బాధ్యత కాదా? జానకి తీవ్రంగా ఆలోచించి పార్టీకి వెళ్ళాలనే నిర్ణయించుకుంది.

5

"ఖర్చీలు ఆరు. సిగరెట్లు ఆరు-" దిగులుగా అన్నాడు మోహనరావు.

"ఈ రోజు మనం ఉత్సాహంగా వుండాలి!" హెచ్చరించాడు వీరేశం.

"అలాగే వుందాం. కానీ ఒక ముఖ్యమైన విశేషం

చర్చించాలి. అదాట్టే ఉత్సాహకరమైనది కాదు. కానీ జీవితానికి చాలా ముఖ్యమైనది—" అన్నాడు శ్రీనివాస రావు.

"ఏమిటది?" అన్నాడు నరహరి ఆత్రుతగా.

"మనమీ పార్టీలు జీవితంలో అద్భుతమైన విజయం సాధించినందుకు చేసుకోవాలనుకున్నాం. అలాగే చేసు కుంటున్నాం. కానీ నాకిప్పుడు అలాగనిపించటంలేదు. ఉద్యోగంలోంచి రిటైరయినప్పుడు జరిగే పార్టీలాగ—జీవితంనుంచి రిటైరయిరపుడు చేసే పార్టీలాగ—వుం టోంది—" అన్నాడు శ్రీనివాసరావు.

"కవి హృదయం అర్థంకాలేదు—" అన్నాడు హర గోపాల్.

"ఇప్పుడీ పార్టీ ఎందుకు?"

"నా నటనకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు వచ్చింది. ఉత్తమ నటుడి బహుమతి నాకు లభించింది. అందుకు!" అన్నాడు వీరేశం.

"తనకు అధికారపక్షం టికెట్ లభించిందని గోవిందయ్య పార్టీ యిచ్చాడు. ఆ రాత్రే అతను చని పోయాడు. నెగ్గుతానసుకోని కేసు నెగ్గానని చంద్ర శేఖరం పార్టీ యిచ్చాడు. ఆ రాత్రే అతనూ చని పోయాడు. ఇప్పుడు వీరేశానికి అనుకోకుండా ఉత్తమ నటుడి బహుమతి వచ్చింది. పార్టీ యిచ్చాడు. ఆ రాత్రి...." అని ఆగిపోయాడు శ్రీనివాసరావు. ఈ మాటలు వింటూనే అందరికీ ముచ్చెమట్లు పోశాయి.

"అయితే ఏమంటావ్?" అన్నాడు మోహనరావు.

"మనలో మనకిలా అనుకోని విజయాలెందుకు వస్తు న్నాయి? పార్టీలివ్వగానే ప్రాణాలెందుకు పోతున్నాయి?

ఇది కాస్త ఆలోచించవలసిన విషయం—"

"ఈ రచయితలతో ఇదే బాధ. కాస్సుంటే గంపంత చేస్తారు. గాలి పోగుచేసి తుఫాన్ సృష్టిస్తారు. మనం అనవసరంగా భయపడుతున్నామని నా అనుమానం—" అన్నాడు హరగోపాల్.

"నా అభిప్రాయం కూడా అదే! ఈ పార్టీ ఉత్సాహంగా వుండడానికే గానీ ప్రాణభయంతో కృంగిపోవడానికి కాదు—" అన్నాడు వీరేశం.

"పార్టీ ప్రారంభానికి ముందు—చిన్న మనవి! ఈ పార్టీలో కూడా ఏదైనా అయితే ఆ తర్వాత కొద్ది నెలలకు మళ్ళీ మనలో ఎవరికైనా అనుకోని విజయం లభిస్తే—పార్టీ ఇచ్చేముందు బాగా ఆలోచించుకోవాలి" అన్నాడు శ్రీనివాసరావు.

"ఒక్క క్షణం—" అన్నాడు హరగోపాల్— "ఒకవేళ ఇవి హత్యలా అనుకుందామంటే హంతకుడు మన ఆరుగురిలోనే ఉండాలి. అలాంటప్పుడు హత్యకు ప్రయోజనం కూడా ఆలోచించాలిగదా! సరదాగా ఎవరూ ఎవరినీ దేనికీ చంపరు ఎంత ఆలోచించినా నా మటుక్కు నాకు నేను గోవిందయ్యనూ, చంద్రశేఖరాన్నీ ఎందుకు చంపానో తెలియటంలేదు."

ఈ మాటలు వింటూనే అంతా నవ్వారు.

అప్పుడు నరహరి యిలాగన్నాడు—"ఈసారి పార్టీ నియమ నిబంధనలు కాస్త మారుద్దాం. రాత్రికిక్కడే ఉండిపోయి ఏ విశేషాలూ లేకపోతే ఎవరి ఊరు వారు పోదాం. విశేషముంటే తక్షణ కర్తవ్యం మిగతా అయిదుగురం చర్చిద్దాం—"

"మిగతా అయిదుగురం అంతే?" వీరేశం గుటకలు మింగుతూ అడిగాడు.

"అది రేపు తెలుస్తుంది—" అన్నాడు శ్రీనివాసరావు.

పార్టీ ప్రారంభమయింది. కొద్ది క్షణాలలోనే అంతా ఉత్సాహంగా మారిపోయారు. మందు ప్రభావం అలాంటిది.

అన్నీ సుష్టుగా అయ్యాక మోహనరావు మొదటి సిగరెట్ వెలిగించి పక్కవాడికి తోశాడు. అప్పుడే ఎవరో తలుపు తట్టిన శబ్దమయింది.

"నాన్సెన్స్! మధ్యలో ఇదేమిటి?" అన్నాడు హరగోపాల్ అసహనంగా.

వీరేశం మాట్లాడలేదు. అంతా సిగరెట్స్ ముట్టించారు. మళ్ళీ తలుపు తట్టిన చప్పుడయింది.

"వీరేశం—నీ ఏర్పాట్లేమీ బాగోలేవు—" అన్నాడు నరహరి.

"సిగరెట్ చివరి దమ్ములోకి వచ్చేదాకా తలుపు తియ్యం. ఈలోగా మళ్ళీ తలుపు తట్టి వేధించకుండా చూడు—" మోహనరావు.

వీరేశం మొహం కందగడ్డలాగయింది. అతను సిగరెట్ దమ్మును మరోసారి లాగేలోగా తలుపు మళ్ళీ చప్పుడయింది.

వీరేశం కుర్చీలోంచి లేచి — "మీరంతా అలాగే కూర్చోండి. చివరి క్షణాల్లో మన ఆనందాన్ని పాడు చేయడానికి వచ్చిన ఆ దుర్మార్గుడి పని పడతాను—" అంటూ విసురుగా తలుపుదాకా వెళ్ళి-నెమ్మదిగా తలుపు తోసి తెర ఒత్తిగించి చూసి ఏదో అనబోయి ఆగి

పోయాడు.

అక్కడ ఒక స్త్రీ వున్నది. ఆమెను ఎప్పుడో చూసినట్లే అనిపిస్తోంది.

"నా పేరు జానకి! మీ స్నేహితుడు గోవిందయ్య భార్యను—" అందామె.

వీరేశం చటుక్కున ఒక్కడుగు బయటకు వేశాడు. అప్పుడు చూసిందామె—అతడి చేతిలోని సిగరెట్టును.

"అది చార్మినార్ సిగరెట్టా?" అంది జానకి కంగారుగా.

"అవును. మీకెలా - తెలుసు....ఓహ్....గోవిందయ్య చెప్పి వుంటాడు—" అని అప్రయత్నంగా ఓ దమ్ము లాగి—"ఈ సమయంలో మీరిక్కడికెందుకొచ్చారు?" అన్నాడు.

"చెబుతాను. ముందా సిగరెట్ అవతల పారేయండి!" అంది జానకి.

వీరేశం ఇంకో దమ్ములాగేసరికి ఆమె కంగారుగా—"ప్లీజ్! ఆ సిగరెట్ అవతల పారేయండి. అది విష పూరితం—" అంది.

వీరేశం ఉలిక్కిపడి ఆగిపోయి — "ఏమన్నారూ?" అన్నాడు.

జానకి క్లుప్తంగా గోవిందయ్య మరణం గురించి చెప్పి ఆనాటి ఉత్తరాన్ని చూపించింది. వీరేశం ఆ ఉత్తరాన్ని జానకికి తిరిగిచ్చేసి—"దీనితో ఓ పెద్దకథ సృష్టించకండి. ఇది సరదాకు రాసిన ఉత్తరం" అన్నాడు.

"అలా కొట్టి పారేయకండి. ఇందులో రాసిన ప్రకారమే రెండు హత్యలు జరిగాయి—" అంది జానకి.

ఆమె ముఖంలో కలవరపాటు కనబడుతోంది.

వీరేశం నవ్వి—తన జేబులోంచి ఓ కాగితం పెన్ను తీసి—ఆ కాగితంమీద ఏదో రాసి జానకికి అందించాడు.

జానకి అది చదివి ఆశ్చర్యపోయింది.

"గోవిందయ్యా! చార్మినార్ సిగరెట్ పెట్టిలో ఎనిమిది సిగరెట్లున్నాయి. వాటిలో ఒకటి విషపూరితం. తెల్లారేలోగా మీలో ఒక్కరుండరు. తర్వాత పార్టీకి పాపం ఏడుగురే ఉంటారు—"

తన దగ్గరున్న ఉత్తరంమీద దస్తూరీ ఇదీ ఒకటిగానే వుంది.

"ఇది సరదాకు నేనే రాశాను. తర్వాతి పార్టీలో దీని గురించి చర్చవస్తే అప్పుడు అసలు సంగతి చెబుదామనుకున్నాను. వినోదం కోసం ఇలాంటి ట్రిక్కులు వేయటం మాకు మామూలే! అయితే నేనా ఉత్తరం రాసిన రోజునే గోవిందయ్య చనిపోవటంతో నేను భయపడి ఈ విషయం ఎవరికీ చెప్పకుండా వూరుకున్నాను. తీరికూర్చుని మనుషుల మనసుల్లో అనుమానాలెందుకూ సృష్టించటం అనిపించింది. మీ మనసులో కూడా యితరత్రా అనుమానాలుంటే దీంతో పోతాయనుకుంటాను—" అన్నాడు వీరేశం ఆమె వంకే చూస్తూ.

జానకి ఆశ్చర్యంగా అతడి వంకే చూసింది.

"పార్టీ చివర్లో వున్నాం. ఇంకా ఏమైనా మాట్లాడాలంటే ఓ పావుగంటలో వస్తాను. మీరు మేడమీద నా భార్యతో కబుర్లు చెబుతూ కూర్చోవచ్చు—" అన్నాడు వీరేశం.

"అవసరంలేదు—" అంది జానకి.

6

వీరేశం వ్రాసిన కవరు చూసింది జానకి. దానిమీద దస్తూరీ—తనకు వీరేశం అప్పటికప్పుడు వ్రాసి ఇచ్చిన ఉత్తరం మీద దస్తూరీ ఒక్కలా లేవు.

తన భర్త చెప్పాడు. ఈ పార్టీకి సంబంధించి అన్ని పనులూ స్వయంగా చేయాలన్నది వారి నియమం. ఉత్తరంమీద చిరునామా వ్రాయటం దగ్గర్నుంచీ అన్నీ తనే చేయాలనేవాడు. అదే నిజమైతే ఎక్కడో ఏదో తిరకాసుంది.

వీరేశం తను చూపించిన ఉత్తరం చూసి ఏ మాత్రమూ కలవరపడలేదు. అంటే దాని గురించి అతడికి ముందే తెలిసి వుండాలి. ఆ ఉత్తరం తనే రాశానని అప్పటికప్పుడు ఋజువు కూడా చేశాడు. పార్టీ చివర్లో వుండటంవల్ల తొందరగా తన్ను వదుల్చుకుని లోపలకు వెళ్ళాలనుకుని వుంటాడు. అందుకే క్షణాల మీద ఋజువు చేసి పంపించాడు.

ఆ ఉత్తరం కారణంగానే తన భర్త మరణించాడు. తనకు అనుమానంగానే వుంది — ఇందులో ఏదో తిరకాసుందని! తన భర్త గోవిందయ్య చనిపోలేదు—హత్య కావించబడ్డాడు. ఆ హత్య గురించి ఎంతో కొంత వీరేశానికి తెలుసును.

ఆ క్షణంలో తన అనుమానాలు వీరేశంమీదకు వెళ్ళిన మాట వాస్తవం. కానీ ఇప్పుడు వీరేశం ఈ లోకంలో లేడు. పార్టీ జరిగిన రాత్రే అతను చచ్చిపోయాడు. అందుకు కారణమేమిటి? ఎవరతన్ని చంపారు?

జానకి తల పట్టుకుంది. ఈ పార్టీలకీ—చావులకీ ఏదో సంబంధముంది. మిగిలిన అయిదుగురిలో ఒకరు హంత

కుడయి వుండాలి. లేదా? బయటి వ్యక్తి ఎవరో వీరిని పార్టీ సమయంలో హత్య చేస్తూ ఉండివుండాలి. అలా ఎవరు చేస్తున్నారు?...జానకి ఆలోచనలు కొనసాగాయి.

తన భర్త తనకు చెబుతూండేవాడు. చాలా పనుల్లో వాళ్ళ స్నేహం ఒకరికొకరి కుపయోగపడిందట. లాయర్ చంద్రశేఖరం చెప్పిన కథ తను విన్నది. దాన్నిబట్టి వీళ్ళు డబ్బు కోసం ఏమైనా చేయగల సమర్థులని తెలుస్తోంది. వీళ్ళ కారణంగా ఎంతమందికి అన్యాయాలు జరిగిపోయాయో? అలాంటివారిలో ఏ ఒక్కరికైనా గుండె మండి వుండవచ్చు.

ఎవరికో అన్యాయం జరగ్గా వచ్చిన విజయ సూచనగా జరిగే ఈ పార్టీలు ఆ గుండె మంటనింకా రెచ్చగొడుతూ ఉండివుండవచ్చు. అందువల్లనే హంతకుడు పార్టీ చేసిన వ్యక్తిని చంపేస్తున్నాడు.

ఎవరా వ్యక్తి?

జానకి ఆలోచనలు తెగలేదు. కానీ పేపర్లో ఓ రోజు మొదటి పేజీలో ప్రత్యేకంగా స్క్వేర్‌లో అనగా నాలుగు గీతల మధ్య పడిన వార్త చూసింది. డాక్టర్ మోహనరావు వైద్యపరంగా సాధించిన ఓ కొత్త విశేషానికి ప్రపంచ ప్రముఖ వైద్య సంస్థలనుండి గుర్తింపు లభించింది. బహుశా అతడికి విదేశాలనుండి ఆహ్వానం కూడా లభించవచ్చును.

జానకి ఆశ్చర్యపడింది. వీరేశం పోయి అప్పటికి మూడు మాసాలయింది. హఠాత్తుగా ఈ డాక్టర్ కింతటి గుర్తింపు ఎలా లభించింది?

మామూలు ఆచారం ప్రకారం అతను పార్టీ చేయాలి. పార్టీ చేస్తే అతను చనిపోతాడనటంలో సందేహంలేదు.

కానీ పార్టీ చేసే అవకాశాలు ఇంత త్వరగా ఎలా ఏర్పడుతున్నాయి—వీళ్ళకి?

హంతకుడెవరైనా ప్రముఖ వ్యక్తి అనుకోవాలి. అతడికి రాజకీయ రంగంలో చాలా పలుకుబడి వుండాలి. అతను ఆ పలుకుబడి ఉపయోగించి వీరందరికీ గొప్ప గుర్తింపు వచ్చేలా చేస్తున్నాడు. పార్టీ చేసే పరిస్థితులు కల్పిస్తున్నాడు. అప్పుడు పార్టీ చేసిన వ్యక్తిని చంపేస్తున్నాడు. ఎవరా హంతకుడు? అతనేం చేస్తున్నాడు?

ఇప్పటికి ముగ్గురయ్యారు. ఎంతో కొంత విషయం తనకు తెలిసినపుడు ఈ హత్యల గురించి తను హెచ్చరించక తప్పదు. మోహనరావు పార్టీ యిచ్చేలోగానే తను అతన్ని హెచ్చరించాలి. జానకి బాగా ఆలోచించి మోహనరావు ఊరికి ప్రయాణమయింది.

జానకి అతడింటికి వెళ్ళేసరికి మోహనరావు ఇంట్లో లేడు. జానకి అతడి భార్యను కలుసుకుంది. మోహనరావు భార్య లక్ష్మి ఆమెను ఆప్యాయంగా పలకరించింది.

"మీతో ఓ విషయం రహస్యంగా మాట్లాడాలి!" అంది జానకి.

ఇద్దరూ ఓ గదిలోకి వెళ్ళారు. జానకి పార్టీల గురించీ హత్యల గురించీ చెప్పి తనకు వచ్చిన ఉత్తరం కూడా చూపించి-వీరేశం అన్న మాటలు చెప్పింది.

లక్ష్మి ఆశ్చర్యంగా ఆ ఉత్తరం వంక చూసి—"ఇది నా భర్త దస్తూరీ—వీరేశానిదెందుకవుతుంది?" అంది.

జానకి తల తిరిగింది. లక్ష్మి వేరే గదిలోకి వెళ్ళి ఓ చిన్న కాగితంతో తిరిగివచ్చింది. దానిమీద మోహనరావు ఓ పర్యాయం డిస్పెన్సరీ నుంచి భార్యకు పంపిన సందేశం వున్నది. దస్తూరీ అచ్చం తన దగ్గరున్న ఉత్తరంమీద

దానిలాగానే వున్నది.

"ఇదెలా సాధ్యం?" అంది జానకి.

"నా భర్త అంటూండేవాడు—వీరేశానికి ఒకసారి చూస్తే ఎవరి దస్తూరీనైనా అనుకరించే శక్తి వున్నదని! అతనొకసారి నరహరిగారి భార్య దస్తూరీ చూసి ఆవిడ రాసినట్లు నరహరికో ఉత్తరం రాశాడట. అందులో భార్యాభర్తను అనరాని మాటలన్నీ రాశాడట. అప్పుడు నరహరి భార్య పుట్టింట్లో వున్నది. నరహరి చేంద్రశేఖరం దగ్గరకు విడాకుల గురించి సంప్రదించడానికి వెళ్ళాడు. అప్పటికి చంద్రశేఖరానికి వీరేశం తన ఉత్తరానికి నకలు పంపించటం కూడా జరిగింది. అందువల్ల వీరేశం నా భర్త దస్తూరీని అనుకరించాడంటే నే నాశ్చర్య పోను—" అంది లక్ష్మి.

"ఎందుకలా అనుకరించడం?"

"పార్టీ క్షణం ఆగినా సహించలేరు వాళ్ళు. ఆ పార్టీలో ఏం మోజున్నదో కానీ — వాళ్ళకు భార్యా బిడ్డలకంటే కూడా ఆ పార్టీలే ఎక్కువ!" అంది లక్ష్మి.

"ఏది యేమైనా ఈసారి పార్టీ జరక్కుండా చూడండి. అది మీవారి ప్రాణాలకే ముప్పు తెస్తుంది-" అంది జానకి.

లక్ష్మి కంగారుగా—"ఈ విషయాలన్నీ మావారికి నేనే స్వయంగా చెబుతాను. మీరు మాత్రం ఆయన్ను కలుసుకుని మాట్లాడకండి. ఆడవాళ్ళ విషయంలో ఆయన బుద్ధి మంచిదికాదు-" అంది. తర్వాత ఆమె గేటుదాకా వచ్చి జానకిని దిగబెట్టింది.

సరిగ్గా అప్పుడే డాక్టర్ మోహనరావు అడుగు పెట్టాడు. కంగారుగా జానకికి వీడ్కోలు చెప్పేసింది

లక్ష్మి. జానకి తనూ మోహనరావును పరిచయం చేసుకోవాలని అనుకున్నది కానీ లక్ష్మికిష్టంలేదని గ్రహించి సంకోచించింది.

ఎర్రగా బుర్రగా వున్న మోహనరావు — సినిమా నటుడు వీరేశం కంటే ఎంతో బాగున్నాడు—"సినిమాల్లోకి వెడితే వీరేశంకంటే ఇతడే బాగా రాణించేవాడేమో!" అనుకుంది జానకి. పార్టీ చేస్తే అతడింక బ్రతకడు — అన్న ఆలోచన కలగ్గానే ఆమె మనసు యేదోలాగైపోయింది. నిట్టూరుస్తూ అక్కణ్ణించి వెళ్ళిపోయిందామె.

మోహనరావు పైట వదులుచేసుకుని యథాలాపంగా అడిగినట్లు—"ఆమె ఎవరు లక్ష్మీ!" అన్నాడు.

"ఎవరైతే మనకెందుకులెండి! యేదో అనాథశరణాలయం చందా పేరు చెప్పి వచ్చింది. నోటితో లేదనే బదులు చేత్తో లేదంటే సరిపోతుందని ఓ రూపాయిచ్చి పంపించాను. చిన్న ముఖం చేసుకుని వెళ్ళింది. మనిల్లు చూసి వందరూపాయలైనా ఇస్తామని అనుకుందట— వంద రూపాయలంటే ఇక్కడ చెట్లకు కాస్తున్నాయనుకుందో యేమో—" అంది లక్ష్మి.

మోహనరావు యేమీ మాట్లాడకుండా — "ఆమెనెక్కడో చూసిన గుర్తు!" అన్నాడు.

"ఈ చుట్టుపక్కల ఆడాళ్ళనందర్నీ మీరు ఎప్పుడో ఎక్కడో ఓ చూపు చూసే వుంటారు—" అంది లక్ష్మి వెటకారంగా.

మోహనరావు నవ్వి—"నీ ఊహలే నిజమైతే నాకెంత బాగుండేది?" అన్నాడు.

7

కవరు అందుకుంటూనే ఆశ్చర్యపడింది జానకి. అది గోవిందయ్యను పార్టీకి ఆహ్వానిస్తూ డాక్టర్ మోహన రావు వ్రాసిన ఉత్తరం. జానకినింకా ఎక్కువ ఆశ్చర్య పరచినదేమిటంటే కవరుమీద దస్తూరీ తన దగ్గరున్న ఉత్తరంమీద దస్తూరితో సరిపోవటంలేదు.

"అంతా అయోమయంగా వుంది—" అనుకుంది జానకి.

లక్ష్మిని తను స్వయంగా కలుసుకుని మరీ చెప్పింది—ఈ పార్టీ ఆపమని. లక్ష్మి ఎందుకు ప్రయత్నించలేదు? లేక భర్త ఆమె మాటలు వినలేదా? వినలేదంటే ఎందుకు? ప్రాణాలకంటే పార్టీయే ఎక్కువా? యేమిటా పార్టీలోని విశేషం!

ఇప్పుడు తనేం చేయాలి?

తెలియని మూర్ఖులనైతే తను కాపాడగలదు. కానీ తెలిసిన మూర్ఖుల్ని ఎలా కాపాడటం? వీళ్ళందరికీ ఆత్మ హత్య చేసుకోవాలన్న కోరిక బయల్దేరి ఇలా వరుసగా పార్టీలు చేస్తున్నారా? ఒకరు కాదు, ఇద్దరు కాదు—ఇప్పటికి మొత్తం ముగ్గురయ్యారు. అంతా తలో ఊళ్ళో వుండటంవల్ల గానీ లేకపోతే ఈ హత్యలకు వార్తల్లో ప్రథమ స్థానం లభించి వుండేది. అసలు హత్యలెలా జరుగుతున్నాయి?

డాక్టర్లు హత్య అని చెప్పటంలేదు. సహజ మర ణమేనని అంటున్నారు. రహస్యమంతా ఆ చార్మినార్ సిగరెట్లలోనే వుంది. ఎవడో కొత్త రకం విషం కని పెట్టాడు.

ఏదియేమైనా జానకి పార్టీకి వెళ్ళలేదు.

పార్టీ అయిన రాత్రి మోహనరావు చచ్చిపోయాడు.

ఈ వార్త చదివి జానకి ఏడుస్తూ కూర్చుంది. తన భర్త ఎలాగూ పోయాడు. కానీ ఇలా వరుసగా ఎనమండుగురు స్నేహితులూ పోవలసిందేనా? ఆమె మనసు పాడైంది.

ఈ ఎనమండుగురూ కలిసి ఏదో మహా పాపం చేశారు. అదేమిటో తెలుసుకుంటే ఇక ముందైనా ఈ హత్యా కాండ ఆగుతుంది.

జానకి మళ్ళీ ఆలోచించింది. ఆగితే తనకేం? ఆగక పోతే నేం?

ఇలాగనుకుని ఆమె ఊరుకోలేకపోయింది. తన భర్తకు డైరీ రాసే అలవాటు లేదు. అదుంటే అతడి రహస్యాలు కొన్ని తెలిసేవి. రాజకీయాల్లో వున్నవాడికి శత్రువు లుండటం సహజం. వాళ్ళలో ఫలానా వారే హత్య చేశారని తెలుసుకోవటం ఎలా?

ఇలా రోజులు గడుస్తూండగానే మరో వార్త జానకిని కలవరపరిచింది. ప్రముఖ పారిశ్రామికవేత్త హరగోపాల్ కు -- ఎగుమతుల పేరు చెప్పి—అదనపు విదేశీ మారక ద్రవ్యం ఆర్జించినందుకు—ప్రభుత్వ బహుమతి లభించింది. ఇంతవరకూ అతడికెలాంటి గుర్తింపూ లేదు ప్రభుత్వపరంగా. ఇదే మొదటిసారి. అతడినభినందిస్తూ ఎందరో పత్రికలలో లేఖలు కూడా రాశారు.

అప్పటికి మోహనరావు మరణించి మూడు నెలలు పూర్తికావస్తోంది. అంటే మూడేసి నాలుగేసి నెలకొకరు చొప్పున ఈ స్నేహితులు నలుగురూ కూడా ప్రాణాలు కోల్పోవలసిందేనా?

ఇప్పుడు తనేం చేయాలి?

మోహనరావును తనకుతానై వెళ్ళి హెచ్చరించింది. స్వయంగా అతన్ని కాకపోయినా—అతడికంటే ఎక్కువగా అతడి ప్రాణాలను రక్షించాలనుకునే భార్యకు చెప్పింది. అయినా ప్రయోజనం లేకపోయింది.

అప్పుడు జానకికి ఒక విషయం అర్థమయింది.

ఈ ఎనమండుగురు స్నేహితులదీ—సామాన్యమైన స్నేహంకాదు. బహుశా స్నేహం కోసం ప్రాణాలు కూడా యిస్తారు. ఎవరికి ప్రత్యేక విజయం లభించినా పార్టీ చెయ్యాలన్నది వారి నియమం. ప్రాణభయంతో వారా పార్టీలు మానరు. అందువల్ల ఈ విషయమై పార్టీలు ఇచ్చేవారిని హెచ్చరించి లాభంలేదు. పుచ్చుకునేవారిని హెచ్చరించాలి.

మోహనరావు విషయంలో ఇదే పొరపాటు తను చేసింది. అతణ్ని బదులు మిగతా స్నేహితులను హెచ్చరించి వుండాల్సింది. పార్టీ తమ స్నేహితుడికి ప్రాణాంతకమైనపుడు అలాంటి పార్టీ తీసుకోవాలని ఏ స్నేహితుడూ అనుకోడు.

జానకి వెంటనే రమేష్, నరహరి, శ్రీనివాసరావులకు అర్జంటుగా రావలసిందిగా టెలిగ్రాంలిచ్చింది. టెలిగ్రాం అందిన వెంటనే వాళ్ళు ముగ్గురూ ఆమె యింటికి వచ్చారు. వారికి ఆమె తనకు తెలిసిన కథ క్లుప్తంగా వివరించింది.

కథ వింటూనే మిత్రులు ముఖముఖాలు చూసుకున్నారు.

"మీరు చెప్పేది నమ్మశక్యంగాలేదు. కానీ జరిగింది చూస్తూంటే నిజమేననిపిస్తోంది. ఏదో మాయ జరుగుతోందని అనుకున్నా ఇంత స్పష్టంగా విషయం ఇప్పుడే

తెలిసింది మాకు. ఇప్పుడు మేము ఏదో ఒకటి చేయాలి" అన్నాడు నరహరి.

"హంతకుడు మీలోనైనా వున్నాడు. లేదా మీ ఎనమండుగురూ కలిసి ఉమ్మడిగా ఎవరికైనా అన్యాయం చేశారేమో గుర్తుచేసుకోండి—" అంది జానకి.

"హంతకుడు మాలో వుంటాడంటే మేమెవ్వరమూ నమ్మలేము—" అన్నాడు రమేష్.

"ఇందులో నమ్మకాల ప్రసక్తిలేదు. మీరంతా మీమీ ప్రాణాలు రక్షించుకోవాలి. ఈ హత్యా కాండను ఆపాలి—" అంది జానకి.

శ్రీనివాసరావు ఆలోచిస్తూ—"చాలా ఆశ్చర్యంగా వుంది నాకు. మీరు వీరేశాన్ని వచ్చి ఈ విషయమై హెచ్చరించి వెళ్ళారు. అయినా వీరేశం మాకా హెచ్చరిక గురించి చెప్పలేదు. అలాగే మోహనరావు భార్యకు కూడా మీరు పార్టీకి ముందే అన్నీ చెప్పారు. అయినప్పటికీ—అతను పార్టీ జరిపించాడు. మాకెవ్వరికీ ఈ హెచ్చరిక గురించి చెప్పలేదు. ఎందుకిలా జరుగుతోంది? ఎవరో బలవంతాన వారిచేత అన్నీ జరిపిస్తున్నారా?" అన్నాడు.

"ఆ వ్యక్తి చాలా పలుకుబడి గలవాడనే అనుకోవాలి. ఎందుకంటే అతను ప్రతి హత్యనూ పార్టీ రోజునే చేస్తున్నాడు. పార్టీ జరగటం కోసం అతను గన పలుకుబడినంతా వినియోగించకపోతే — మీ మిత్రులందరికీ అలాంటి గుర్తింపులు లభించి వుండేవంటారా? ఆ వ్యక్తి ఎవరో మీరు తెలుసుకోవాలి!" అంది జానకి.

"మరి ఆ ఉత్తరంలోని దస్తూరీ సంగతేమిటంటారు? ముందు అది వీరేశానిదనుకున్నారు. తర్వాత అది మోహన

రావుదని తేలింది. కానీ ఆ విషయమూ అనుమానించవలసిందే నంటున్నారు. ఇప్పుడు మన ముగ్గురిలో ఆ దస్తూరీ ఎవరిదో చూడాలి!" అన్నాడు నరహరి ఆలోచిస్తూనే!

"దస్తూరి ఎవరిదో తెలుసుకోవటం వ్యర్థమని జానకిగారి పరిశోధనవల్ల తేలింది. ఇప్పుడు మనం ఈ విషయమై మన సమయం వృధా చేయవద్దు. ముందుగా మోహనరావు ఇంటికి వెళ్ళి జానకిగారి హెచ్చరికను వాళ్ళెందుకు అశ్రద్ధ చేశారో అతడి భార్య నడిగి తెలుసుకుందాం—" అన్నాడు శ్రీనివాసరావు.

"కొంత నాకు తెలుసు. తన భర్త ప్రవర్తన మంచిది కాదని మోహనరావు భార్యకు అనుమానం. ఆ అనుమానం కసిగా మారి తనూ అక్రమ సంబంధాలేర్పర్చుకుందని మోహనరావు అనుమానం. ఇద్దరూ తమకు ఋజువులున్నాయనేవారు. మొత్తంమీద వారి వైవాహిక జీవితం అంత బాగున్నట్లు లేదు. బహుశా లక్ష్మిగారు జానకిగారి హెచ్చరిక గురించి భర్తకు చెప్పలేదేమోనని నా అనుమానం...." అన్నాడు నరహరి.

"వీరేశంగారి దస్తూరీ అనుకరణ గురించి లక్ష్మిగారొక తమాషా కథ చెప్పింది. అది చెప్పటమే మరిచిపోయాను" అంటూ జానకి క్లుప్తంగా ఆ కథ వివరించింది.

"ఇది అబద్ధం!" అన్నాడు నరహరి చిరాగ్గా.

"ఆవిడ అబద్ధమెందుకు చెబుతుంది?" అన్నాడు రమేష్.

"ఆ విషయం తర్వాత ఆలోచిద్దాం. మీరు గమనించారో లేదో—ఇవి నిజంగా హత్యలే అయినట్లయితే హంతకుడు చాలా తెలివిగా ప్రవర్తించాడనే చెప్పాలి.

ముందు రాజకీయ ప్రముఖుణ్ని తొలగించాడు. తర్వాత నేరపరిశోధనకు అనువులేకుండా లాయర్ని తొలగించాడు. కానీ అసలు హత్యకు అసలు కారణం ఏమిటి? మన గ్రూపునే ఎందుకు చంపాలి? అదీ పార్టీ రోజునే ఎందుకు చంపాలి?" అన్నాడు శ్రీనివాసరావు.

"ఈ హత్యలకు, పార్టీకి ఏదో సంబంధముంది. ఎవరికో తీరని అన్యాయంచేసి మీరు పార్టీ చేసుకుని వుంటారు. అతడు నెమ్మదిగా జీవితంలో పైకి వచ్చి వుంటాడు. పార్టీ రోజునే మిమ్మల్ని చంపాలనుకుంటున్నాడు!" అంది జానకి.

"అసలు హత్య ఎలా జరుగుతోంది!" రమేష్ ప్రశ్న.

జానకి ఉత్తరం చూపించింది.

"చార్మినార్ సిగరెట్టు—" అన్నాడు శ్రీనివాసరావు.

"ఈ దస్తూరీ నేనెక్కడో చూశాను—" అన్నాడు నరహరి.

"ఏమో—దస్తూరీలు నాకంత బాగా గుర్తుండవు—" అన్నాడు రమేష్.

"మనం ముగ్గురం ఇప్పటికిప్పుడు ఈ దస్తూరీకి నకళ్ళు తీద్దాం. ఎవరిది సరిపోలితే వాళ్ళు సంజాయిషీ యిచ్చుకోవాల్సి వుంటుంది—" అన్నాడు నరహరి.

"దస్తూరీతో హంతకుణ్ణి సరిపోల్చాలనుకోవటం—కుక్క తోక పట్టుకుని గోదావరీదడం లాంటిది. నిజంగా హంతకుడు మన ముగ్గురిలోనే వుంటే సరిగ్గా ఇదే రకంగా రాస్తాడా? అదీకాక ఈ ఉత్తరంలోది ఒరిజనల్ దస్తూరీ అనడానికి సాక్ష్యమేమిటి?" అన్నాడు శ్రీనివాసరావు. దస్తూరీ పరీక్ష అతడికి బొత్తిగా నచ్చినట్లులేదు.

"దస్తూరీ పోల్చడానికి నిపుణులున్నారు-" అన్నాడు నరహరి.

"ఈ పోటీలో నేను పాల్గొనదల్చుకోలేదు. అసలు మోహనరావింట్లో ఈ ఉత్తరపు దస్తూరీ ఎలా వచ్చిందీ అన్న విషయం తేల్చాలి—" అన్నాడు శ్రీనివాసరావు.

"దస్తూరీ పరీక్ష నీకెందుకు ఇష్టంలేదు?" అన్నాడు నరహరి శ్రీనివాసరావు వంక అనుమానంగా చూస్తూ.

"ఇష్టంలేదు—అంతే!" అన్నాడు శ్రీనివాసరావు.

"సరే—నువ్వు చెప్పినట్లే చేద్దాం. ముందు శ్రీమతి మోహనరావును కలుసుకుందాం. ఆవిణ్ని చాలా అడిగి తెలుసుకోవాలి—" అన్నాడు నరహరి.

ముగ్గురూ జానకి దగ్గర సెలవు తీసుకుని మోహనరావు ఊరు వెళ్ళారు.

అక్కడ లక్ష్మి ఉత్సాహంగానే వున్నది. ఆమె హిందూ సంప్రదాయాన్ని పాటించకుండా చక్కగా బొట్టు పెట్టుకుని, చేతులనిండా గాజులు వేసుకుని, తలలో మల్లెలు కూడా తురుముకుని వున్నది. మిత్రులు చెప్పిన కథ విని ఆమె ఆశ్చర్యంగా—"జానకి ఎవరు? ఆమె ఎవరో నాకు తెలియదు—" అంది.

ఆశ్చర్యపోవడం ఇప్పుడు మిత్రులవంతు అయింది.

ఈ ఆడవాళ్ళిద్దరిలోనూ ఒకరు అబద్ధం చెబుతున్నారు. పనిగట్టుకుని తమను తనింటికి ఆహ్వానించిన జానకి అబద్ధమెందుకు చెబుతుంది?

నరహరి, శ్రీనివాసరావు లక్ష్మిని చాలా ప్రశ్నలు వేశారు. మోహనరావు చావు గురించి ముందుగా తన కెలాంటి హెచ్చరికా అందలేదని లక్ష్మి నొక్కి చెప్పింది.

"మీకు మీ భర్త అంటే యిష్టంలేదు. ఆయన

పోయినా ఫర్వాలేదనుకుని ఈ హెచ్చరిక ఆయనకు చెప్పలేదు. అవునా?" అన్నాడు నరహరి.

ఈ అభియోగానికి లక్ష్మి చలించలేదు—"దేశాన్ని కొల్లగొట్టి బ్రతికే పెద్దమనుషులు మీరు. అందువల్ల మీకు మానవత్వమంటే తెలియదు. చూస్తూ చూస్తూ ఓ నిండు ప్రాణం పోతుందని తెలిసీ ఊరుకోవడం ఎలా సాధ్యమవుతుంది?"

శ్రీనివాసరావు కోపం వచ్చింది — "మిమ్మల్ని చూడగానే ఎవరికీ మీ భర్తపోయి కొద్ది మాసాలే అయిందనిపించదు—" అన్నాడు.

"ఎందుకనిపించాలి? నాకు తెలిసిన ఒకాయన భార్య పోయిన రెండు నెలలకు మళ్ళీ పెళ్ళిపీటల మీద కూర్చున్నాడు. పెళ్ళాం పోగానే మగాళ్ళు కూడా గుండు కొట్టించుకుని, పంచె కట్టుకుని చొక్కా లేకుండా తిరగటం మొదలెడితే — నేనూ అన్ని నియమాలూ పాటిస్తాను. ఈ శతాబ్దంలో ఇంకా మీలాంటివారున్నారంటే...." అని ఆయాసపడుతూ ఆగింది లక్ష్మి.

తన మాటల్లోని లోపం శ్రీనివాసరావుకు వెంటనే తెలిసిరాగా—"అయాం సారీ—ఏదో నోరు జారాను—" అన్నాడు.

"ఇట్సాల్ రైట్!" అంది లక్ష్మి.

అక్కణ్ణించి బయటపడ్డాక — "నాకు లక్ష్మిమీద అనుమానంగా వుంది—" అన్నాడు శ్రీనివాసరావు.

"అది నీకు సహజం—నిన్నావిడ బాగా తిట్టిందిగా" అన్నాడు రమేష్.

"ఏది ఏమైనా ఆవిడ కారణంగా అన్యాయమంటూ

జరిగితే అది మోహనరావుకే జరిగింది. మిగతా మరణాలకు ఆవిడ బాధ్యురాలని నేననుకోను. అంతేకాదు ఆవిడ మోహనరావును హెచ్చరించి వుండకపోవచ్చు. అంతమాత్రాన ఆవిడే ఈ హత్య చేసిందని అనలేము. అసలిది హత్య అనడానికే ఋజువులేదు—" అన్నాడు నరహరి.

"ఇప్పుడేం చేద్దాం?" అన్నాడు రమేష్.

"మనం హరగోపాల్‌ని హెచ్చరించటంలో అర్థం లేదు. హంతకుడి కన్ను అతడిమీదపడింది. పార్టీ ఆగిపోతే హంతకుడు మరో పథకం వేయవచ్చు. ఇప్పుడున్న పథకం కొనసాగితేనే హంతకుణ్ని పట్టుకునే దారి కనబడుతుంది—" అన్నాడు శ్రీనివాసరావు.

"హంతకుణ్ని హత్యచేశాక పట్టుకుంటామా, చేస్తూండగా పట్టుకుంటామా, ఇంకా ముందే పట్టుకుంటామా?" అన్నాడు రమేష్.

"మనం హత్య ఆపగలం. అంతా ఆ చార్మినార్ సిగరెట్లో వుంది. కాబట్టి పార్టీలో ఈ సారి మనం సిగరెట్ పెట్టె హరగోపాల్‌కు కూడా తెలియకుండా మార్చేద్దాం. తర్వాత పార్టీలోని సిగరెట్ పెట్టెని పరీక్ష చేయిద్దాం—" అన్నాడు శ్రీనివాసరావు.

"నిజంగా పార్టీలు హత్యకు దారితీస్తున్న మాటయితే ఈ సూచన చాలా బాగుంది. మొత్తానికి రచయితనని పించుకున్నావు—" అని మెచ్చుకున్నాడు నరహరి.

8

హరగోపాల్ నించి గోవిందయ్య పేరున పార్టీకి ఆహ్వానం వచ్చింది. అది చూసి జానకి కళ్లొత్తుకుంది.

"వీళ్ళందరికీ వరుసగా మూడినట్లుంది. లేనిపక్షంలో

ఇలా వరుసగా పార్టీలివ్వరు" అనుకుందామె.

సుమారు ఒక్క సంవత్సరం వ్యవధిలో ఎనమండుగురు మిత్రులూ ముగ్గురిగా మారిపోతున్నారు. పార్టీకొకరు చొప్పున పోతున్నా పార్టీలు మానెయ్యాలని వాళ్ళను కోవడంలేదు. చావుకు భయపడ్డంలేదు. ఏమిటీ పార్టీలలోని విశేషం? ఎప్పటికీ వాళ్ళు నిజం గ్రహించరేం?

ఇలా ఒక్కొక్కరే పోతూంటే చివరికి ఎవరు మిగులుతారు?

జానకి అనుకున్నట్లే హరగోపాల్ మరణ వార్త పేపర్లో వచ్చింది. అది జరిగిన మర్నాడే మిగిలిన ముగ్గురు మిత్రులూ జానకి యింటికి వచ్చారు.

"సందేహంలేదు. ఇది నిజంగా హత్యాకాండే! కానీ హత్య ఎలా జరుగుతోందో తెలియదు. హంతకుడెవరో తెలియదు. ఎందుకు జరుగుతోందో తెలియదు. ఈ విషయంలో మీకు చాలా వివరాలు తెలుసును. ఇంక మీదనైనా ఈ హత్యాకాండ ఆపడానికి మీకు తోచిన ఉపాయం చెప్పండి!" అన్నాడు నరహరి.

"మీ ముగ్గురిలో ఒకరికి తప్పకుండా మళ్ళీ ఏదో గొప్ప గుర్తింపు లభిస్తుంది. అప్పుడు పార్టీ చెయ్యడం మానేయండి—" అంది జానకి.

"బ్రతికున్నంత కాలం ఇలా పార్టీలు చెయ్యాలనీ, బ్రతికుండకపోయినా మాలో మాకు ఆహ్వానాలు పంపుకోవాలనీ నియమం పెట్టుకున్నాం. ఇప్పటికి అయిదుగురు పోయారు. మిగతా ముగ్గురం మాత్రం ఈ పద్ధతి ఎందుకు మానాలి? హంతకుడు మమ్మల్ని చంపదల్చుకుంటే ఎలాగూ చంపుతాడు. వాడికి భయపడి ఈ పార్టీలు మానడం నాకిష్టంలేదు...." అన్నాడు నరహరి.

మిగతా యిద్దరూ అతడితో ఏకీభవించారు.

"చార్మినార్ సిగరెట్లు కూడా పరీక్ష చేయించాం. పార్టీకని తెచ్చిన సిగరెట్లు మార్పిడీ చేశాం. అవి ఫ్యాక్టరీలో కూలీలకిచ్చాం తాగమని. వాళ్ళు తాగి నిక్షేపంగా వున్నారు. మేము చేసిన మార్పిడీ విషయం హరగోపాల్‌కు తెలియదు — మేమిచ్చిన సిగరెట్లలో ఒకటి తాగి అతను చనిపోయాడు. అతని మరణానికి సిగరెట్ కారణమని నేననుకోను—" అన్నాడు నరహరి.

"మీ పరిస్థితి చూస్తే నాకు జాలిగా వుంది. ఇందులో నేను చేయగలిగిన సాయమేముంది?" అంది జానకి.

"ఇంతవరకూ మా పార్టీకి మా స్నేహితులం మాత్రమే వస్తున్నాం. ఇంకమీదట మిత్రులకు ప్రతినిధులుగా మిత్రుల భార్యలను కూడా ఆహ్వానించాలనుకుంటున్నాం. దీనికి మీరేమంటారు?" అన్నాడు నరహరి.

జానకి మొహం యెర్రబడింది — "ఇందులో నేననేదేమీ లేదు. అది మన సంప్రదాయానికి విరుద్ధం—" అంది.

ఆమె ముఖకవళికలు గమనించిన నరహరి—"అయాం సారీ-ఈ విషయమై మీరు అన్యథా భావించినట్లున్నారు. పార్టీకి కొత్త మనుషులు వస్తే హంతకుడి ప్రవర్తన ఎలా గుంటుందీ చూడాలనుంది. మీలాంటివారు వస్తే హంతకుడు బయట పడతాడని మా ఆశ!" అన్నాడు.

"ఈ విషయంలో నేను మీకు సాయపడలేను—" అంది జానకి.

"నిర్ణయం తీసుకునేందుకు తొందరేముంది? మేమెలాగూ మీ భర్త పేరున ఆహ్వానం పంపిస్తాం. ఆయన ప్రతినిధిగా వచ్చే హక్కు మీకు ఎప్పుడూ వున్నది.

మీకు వీలుపడితేనే రండి!" అన్నాడు నరహరి.

తర్వాత ముగ్గురు మిత్రులూ అక్కణ్నించి బయట పడ్డారు.

"నువ్వు తొందరపడ్డావు. ఆమె అపార్థం చేసుకునే అవకాశముంది—" అన్నాడు శ్రీనివాసరావు. రమేష్ అతడి మాటను బలపరిచాడు.

"అపార్థం చేసుకోవాలనే అన్నాను—" అన్నాడు నరహరి.

"అంటే?" అన్నాడు రమేష్.

"నాకు జానకి మీద చాలా అనుమానంగా వుంది. ఆమెకు హంతకుడు తెలుసని నా అనుమానం" అన్నాడు నరహరి.

"నాకర్థం కాలేదు—" అన్నాడు రమేష్. శ్రీనివాసరావు ఆలోచిస్తున్నాడు.

"హంతకుడు మన ఎనమండుగురికీ బద్ధ శత్రువు. కానీ జానకి అంటే అతడి కిష్టం. ముందు గోవిందయ్యను చంపేశాడు. అందువల్ల జానికికి లాభమే చేకూరివుండాలి. అయితే హంతకుడు ఆ తర్వాత మనల్లో ఒక్కొక్కరినే చంపాలనుకున్నాడు. అది జానకికిష్టంలేదు. ఆమె అతణ్ని వారించింది. అతడు వినలేదు. విధిలేక ఏదో కథ కల్పించి మనకు చెప్పింది. మనని హెచ్చరిస్తోంది. మనం జాగ్రత్తలో వుంటామని ఆమె ఆశ. జానకి మనసు మంచిది. ఆమె మనతోపాటు పార్టీలో వున్నదంటే హంతకుడు పని కష్టమవుతుంది. అందుకనే ఆమెను ఆహ్వానించాను—" అన్నాడు నరహరి.

"కానీ ఆమె రాదు—" అన్నాడు శ్రీనివాసరావు.

"జానకిని బయటపెట్టడానికి నేనింకో రిస్కు తీసుకో

దలిచాను—" అన్నాడు నరహరి. చెప్పడానికి సంకోచిస్తున్నట్లు అతడి ముఖం చెబుతోంది.

"ఏమిటది?" ఆత్రుతగా అడిగారు మిగతా ఇద్దరూ.

"మీరు నన్ను తప్పు పట్టకూడదు—" అన్నాడు నరహరి.

"ముందు చెప్పు!" అన్నాడు శ్రీనివాసరావు.

"నేను జానకికి ప్రేమ లేఖ వ్రాస్తాను—" అన్నాడు నరహరి.

రమేష్, శ్రీనివాసరావు మారాలోచించకుండా నరహరిని తిట్టారు—"ఆమె మన స్నేహితుడి భార్య. అందులోనూ స్నేహితుడిప్పుడు జీవించిలేడు. ఆమెకు రక్షణగా నిలవాల్సిందిపోయి కబళించడమా—ఛీ..ఛీ.."

"ఆవేశపడకండి బాబులూ—" అన్నాడు నరహరి—"జానకి స్నేహితుడి భార్య. కాదనను. స్నేహితుడిప్పుడు జీవించిలేడు. కాదనను. కానీ ఆమె కూడా ఆడది. ఆమెలో ఇంకా కోరికలు మిగిలే వున్నాయి. ఆమెను నేను కోరితే—అదామెకు సహాయం చేయడమే అవుతుంది కానీ కబళించడం అనిపించుకోదు. అదలాగుంచండి. నేనిలాగంటే మీరే యింత ఆవేశపడ్డారు కదా-హంతకుడింకెంత ఆవేశపడతాడు. అతడు నన్నే చంపాలనుకుంటాడు. పార్టీ చేసేదాకా ఆగలేడు. ఆ విధంగా నేను రిస్కు తీసుకుంటున్నాను.

"హంతకుడు తెలివైనవాడు. తెగించినవాడు. నన్ను చంపాలనుకుంటే తెలివిగా చంపగలడు. అయినా నేను రిస్కు తీసుకుంటున్నాను. ఈ ప్రయత్నంలో హంతకుడు పట్టుబడ్డాడా సరేసరి! లేని పక్షంలో మీకు జానకిలో ఏదో రహస్యమున్నదని తెలుస్తుంది. నేను పోయినా మీ

ఇద్దరికి రక్షణ కలుగుతుంది—"

"ఒక వేళ నువ్వనుకున్నట్లు జరక్కపోతే? జానకి నీ ప్రేమ నంగీకరిస్తే?" శ్రీనివాసరావు అనుమానంగా అన్నాడు.

"అందువల్ల నష్టమేముంది? జానకి నా భార్యకంటే అందమైనది. అది నా అదృష్టంగా భావిస్తాను—...." అన్నాడు నరహరి.

"అయితే రిస్కు నేనే తీసుకుంటాను—" అన్నాడు శ్రీనివాసరావు.

"వెర్రివాడా—రెండోది జరిగే పనికాదు. అనవసరంగా నీ ప్రాణం పణం పెట్టకు. రిస్కు నన్నే తీసుకోనీ!" అన్నాడు నరహరి.

శ్రీనివాసరావు మాట్లాడలేదు. అతను నరహరిని పరీక్షించి చూశాడు. అతడి ముఖంలో పట్టుదల కనబడుతోంది. ఏమనుకున్నాడో శ్రీనివాసరావు వెంటనే—"సరే—నువ్వే రాయి—" అన్నాడు.

అప్పుడు నరహరి — "ఒకవేళ నామీద హత్యాప్రయత్నం జరక్కపోవచ్చు. జానకి నా ఉత్తరం చదివి మండిపడొచ్చు—అప్పుడు నా మనసులోని అసలు అభిప్రాయమేమిటో మీ రామెకు చెప్పి నా పరువు కాపాడాలి. అందుకు సాక్ష్యంగా వుంటారనే ముందుగా మీకిదంతా చెబుతున్నాను—" అన్నాడు.

9

జానకి ఆ ఉత్తరాన్ని చదువుకుంది. ముందామె కళ్ళు ఎర్రబడ్డాయి. తర్వాత వళ్ళంతా ఆవేశంతో వణికింది.

"బ్రూట్!" అన్న పదం అప్రయత్నంగా ఆమె నోటినుంచి బయటకు వచ్చింది. తర్వాత ఉత్తరం ఆమె

చేతిలో కసిగా నలిగింది.

కొద్ది క్షణాలు గడిచేసరికి ఆమె ఆవేశం తగ్గింది. నెమ్మదిగా నరహరి గురించి ఆలోచించసాగింది. పార్టీకి రమ్మన్నప్పుడే అతడి పాడుబుద్ధి కొంతవరకూ అర్థమయింది. కానీ మరీ యింతకు తెగిస్తాడని అనుకోలేదు. ఎంత ధైర్యం అతగాడికి! స్నేహితుడి భార్య అన్న గౌరవమైనా లేకుండా తనకెలాంటి నీచమైన ఉత్తరం రాశాడు!

వీళ్ళ బుద్ధులు మరీ యింత నీచమైనవి కాబట్టే ఓ హంతకుడు వీరిమీద పగబట్టాడు. వారికి తగిన శాస్తే జరుగుతోంది. అసలు తను ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోకుండా వుండాల్సింది. తన భర్త మరణించడమూ, ఆ తర్వాత ఒక్కొక్కరే అదే పరిస్థితుల్లో మరణించడమూ చూసి ఊరుకోలేకపోయింది. వారికి సాయం చేద్దామనుకుంది. ఇప్పుడేం చేయాలి?

జానకి ఉత్తరం మళ్ళీ సాపుచేసి మరోసారి చదివింది. మళ్ళీ ఆమె కళ్ళు ఎర్రబడ్డాయి. మళ్ళీ ఉత్తరం నలిగింది.

తర్వాత జానకి రోజూ పేపరు చూస్తూండేది. ఒక రోజు ఆమె కోరిన వార్త పేపర్లో కనబడింది. నరహరి కాలేజీకి చేసిన సేవ ప్రభుత్వ స్థాయిలో గుర్తించ బడింది. అతడు ప్రిన్సిపాలుగా వున్న కాలేజీ దేశానికే ఆదర్శంగా వున్నదట!

"నరహరీ__నీ పని అయిపోయింది_" అనుకుంది జానకి. ఈ పర్యాయం అతడిపై ఆమెకు ఏ మాత్రమూ జాలికలుగలేదు.

నరహరి నుంచి పార్టీకి ఆహ్వానం గోవిందయ్య పేరున కూడా వచ్చింది. జానకి ఆ ఆహ్వానాన్ని ఓ మూలగా

పెట్టింది.

ఈ పార్టీకి నరహరి తనను భర్తకు ప్రతినిధిగా రమ్మన మన్నాడు. ముందు స్నేహితులు—తర్వాతనే భార్య—అనేవాడు గోవిందయ్య. అటువంటి గోవిందయ్య స్నేహితుడు నరహరి గోవిందయ్య స్థానంలో అతడి భార్యను రమ్మన్నాడు.

"తగిన శాస్తి జరుగుతుందిలే!" అనుకుంది జానకి.

ఆమె అనుకున్నట్లే తగిన శాస్తి జరిగింది. అంతవరకూ పోయిన వారందరికీ లాగే నరహరి కూడా చని పోయాడు.

నరహరి చనిపోయిన నాలుగు రోజులకు రమేష్, శ్రీనివాసరావు కలిసి జానకి యింటికి వచ్చారు.

"మీరు పదేపదే మా యింటికి రావద్దు—" నిర్మొహ మాటంగా అన్నది జానకి.

శ్రీనివాసరావుగానీ రమేష్‌గానీ చిన్నబుచ్చుకోలేదు. "ఒక ముఖ్య విశేషం చెప్పడానికి మీ యింటికి వచ్చాం. హంతకుడి ఆచూకీ దొరికింది—" అన్నాడు రమేష్.

జానకి ఆశ్చర్యంగా — "ఎలా దొరికింది?" అంది.

"చనిపోయిన నరహరి అందుకు ఎంతో సాయ పడ్డాడు—" అన్నాడు రమేష్.

"మీ స్నేహితులు పరమ దుర్మార్గులు. గోముఖ వ్యాఘ్రాలు. పయోముఖ విషకుంభాలు. ఆ హంతకుడెవరో గానీ అతణ్ని నేనభినందిస్తున్నాను—" అంది జానకి.

"అయితే హంతకుడెవరో మీకు తెలుసుకోవాలని లేదా?" అన్నాడు రమేష్.

"ఎవరో చెప్పండి. అతణ్ని నేను కూడా స్వయంగా కలుసుకుని అభినందించాలి కదా!" అంది జానకి,

"హంతకుడి క్లూ మీ యింట్లోనే వుంది. మీ వారి సౌండ్ ప్రూఫ్ బెడ్‌రూంలో వుంది—" అన్నాడు శ్రీనివాసరావు.

"ఏమిటా క్లూ!" అంది జానకి.

"మీకు చూపిస్తాను. అదాయన బెడ్డులో వుంది—" అన్నాడు శ్రీనివాసరావు.

"పదండి—" అంది జానకి.

ముందు శ్రీనివాసరావు, వెనుక జానకి, ఆ వెనుక రమేష్ నడిచి బెడ్‌రూం చేరుకున్నారు. రమేష్ తలుపు దగ్గర ఆగిపోయాడు. శ్రీనివాసరావు మంచందాకా వెళ్ళాడు. జానకి అతణ్ని అనుసరించింది.

శ్రీనివాసరావు ఓ పర్యాయం మంచం దగ్గర దిండు ఎత్తాడు. ఆ తర్వాత డన్‌లప్ పరుపు ఎత్తాడు. అప్పుడు గది తలుపు మూసుకున్న చప్పుడు విని వెనక్కి తిరిగింది జానకి. రమేష్ అప్పుడే తలుపు లాక్ చేశాడు.

"ఏమిటిది?" అరిచింది జానకి.

"ఇది సౌండ్ ప్రూఫ్ గది!" గుర్తుచేశాడు శ్రీనివాసరావు.

"ఏమిటి మీ ఉద్దేశం?" అంది జానకి తీవ్రంగా.

"క్లూ ఈ గదిలో ఉందన్నానుగా-అది అబద్దంకాదు. క్లూ ఇప్పుడీ గదిలోనే నా ఎదురుగా వుంది. చెప్పు— హంతకుడెవరు?" అన్నాడు శ్రీనివాసరావు.

"హంతకుడెవరో నాకెలా తెలుస్తుంది?" అరిచింది జానకి.

"తెలుస్తుంది. ఎందుకంటే హంతకుణ్ని నువ్వే నియమించావు కాబట్టి!" అన్నాడు శ్రీనివాసరావు కర్కశంగా నవ్వుతూ.

"హంతకుణ్ని నేను నియమించడమేమిటి? మీ కేమైనా మతిపోయిందా?" అంది జానకి. ఆమె వాళ్ళిద్దరి వంకా బెదురు చూపులు చూస్తోంది.

"మొట్టమొదటిసారిగా నిన్ను నరహరి అనుమానించాడు. నిన్ను పట్టివ్వడం కోసం తన ప్రాణాలే బలిపెట్టాడు—" అంటూ శ్రీనివాసరావు తమ పథకమంతా వివరించాడు.

"అయ్యో — ఇదంతా నాకు తెలీయదు. నరహరి నిజంగా నే పశువాంఛతో వున్నాడనుకున్నాను—" అంది జానకి.

"అనుకునే హంతకుణ్ని అతడి మీదకు పురమాయించావు!"

"లేదు. హత్యల గురించి నాకేమీ తెలియదు—" అంది జానకి.

"పోలీసులు నేరస్థుల చేత నిజం చెప్పడానికి కొన్ని పద్ధతులెన్నుకుంటారు. ఆ పద్ధతులమలు చేయడానికి కర్కశ హృదయముండాలి. మేము నీ చేత నిజం చెప్పించడానికి అలాంటి కర్కశ హృదయం కలిగి వుండనవసరం లేదు. రసిక హృదయముంటే చాలు. ఏమంటావ్?" అంటూ శ్రీనివాసరావు ఆమె చేయి పట్టుకున్నాడు. ఆమె విదిలించుకోబోతూండగా రమేష్ ఆమె రెండో చేయి పట్టుకున్నాడు.

"మీ యింట్లో నీ గదిలో నిన్ను బలవంతం చేయబోతున్నాం—మాకు నీమీద మోజులేదు. మా మనసులో కానీ శరీరం కానీ నిన్ను కోరడంలేదు. ప్రాణానికి ప్రాణంగా వున్న ఎనమండుగురు స్నేహితుల ప్రాణాలను ఒకటొకటిగా పుచ్చుకున్న నేరానికి—స్త్రీకి ప్రాణం

కంటే విలువైనదనే మానాన్ని నీనుండి హరించ బోతున్నాం. అందుకు కొన్ని క్షణాలు మాత్రం గడు విస్తున్నాం. ఆలోచించుకో. హంతకుడెవరో చెప్పి నీ మర్యాద దక్కించుకో. మానం కాపాడుకో లేదా— తగిన శాస్తి జరుగుతుంది...." అన్నాడు శ్రీనివాసరావు.

"నిజంగా నాకేమీ తెలియదు...." అంది జానకి.

శ్రీనివాసరావు అంకెలు లెక్కపెట్టడం మొదలు పెట్టాడు. సరిగ్గా పది అంకెలు ఆమెకు గడువిచ్చాడు.

జానకి తనకేమీ తెలియదని వేడుకుంటోంది.

శ్రీనివాసరావు అంకెలు లెక్కపెడుతున్నాడు.... తొమ్మిది....పది....

రమేష్ జానకిని మంచంమీదకు లాగాడు.

ఇద్దరు పురుషులు....ఒక అతివ....

సౌండ్ ప్రూఫ్ గది....

తన యింట్లో తనపైనే దురాచారం ...జానకికి మతి పోతోంది.

"ఏమిటీ దురాగతం?...." ఆమె ఎంత అరిచినా గిలగిలా కొట్టుకున్నా ప్రయోజనం కనబడ్డంలేదు. వాళ్ళకు తను లొంగిపోతోంది.

వాళ్ళు తనను పూర్తిగా స్వాధీనపర్చుకుంటున్నారనీ- తను వారి దురాగతానికి లోబడిపోతున్నాననీ గ్రహించినపుడు ఆఖరి ప్రయత్నంగా జానకి కెవ్వుమని కేక పెట్టింది—వంట్లోని శక్తినంతా కూడగట్టుకుని.

ఆ కేకకు శ్రీనివాసరావు, రమేష్ ఉలిక్కిపడి మంచానికి అటూ యిటూ పడ్డారు. ఆ కాస్త అవకాశానికే త్వరత్వరగా బట్టలు సరిచేసుకుంది జానకి. అయితే శ్రీనివాసరావుగానీ, రమేష్‌గానీ లేవలేదు. తన

దగ్గరకు రాలేదు.

ఇప్పుడేం చేయాలి? త్వరగా లేచి పారిపోవాలా?

జానకి మంచం దిగింది. ఇటు పడివున్న శ్రీనివాసరావు కదలడంలేదు. జానకి పరుగున వెళ్ళి తలుపు తీసింది. మళ్ళీ తలుపులు వేసింది. త్వరగా ఫోన్ దగ్గరకు పరుగెత్తింది. పోలీసులకు ఫోన్ చేసింది.

పోలీసులు వచ్చి చూసి—రమేష్, శ్రీనివాసరావు—ఇద్దరూ మరణించినట్లు తేల్చారు. జానకి ఆశ్చర్యానికి అంతులేదు. పోలీసులకామె భర్త పేరున మొదటవచ్చిన ఉత్తరాన్ని నరహరి తనకు రాసిన ఉత్తరాన్ని మినహాయించి క్లుప్తంగా కథ చెప్పింది. పోలీసులామె వాఙ్మూలాన్ని రికార్డు చేసుకున్నారు.

పరిశోధనలో శ్రీనివాసరావు, రమేష్‌లది సహజ మరణమేనని తేలింది. జానకికి ఏ శిక్షా పడలేదు. పోలీసులామె కథనాన్ని నమ్మారు. నమ్మక వారు చేసేదీ లేదు. ఈ ఎనిమిది చావుల గురించీ పత్రికలన్నీ పెద్ద విశేషంగా రాశాయి.

10

ఈ రెండు చావులూ జరిగిన వారం రోజులకు జానకి రాత్రిపూట సరిగ్గా నిద్రపట్టక — భర్త ప్రత్యేకంగా వుంచుకునే గదివైపు నడిచింది. గదిలో ఏదో కలకలంగా వున్నట్లనిపించిందామెకు.

చటుక్కున తెర ఒత్తిగించి గదిలోకి తొంగిచూసింది. వెంటనే ఆమె గుండె గుభేలుమంది. నోట మాటరాలేదు.

అక్కడ ఓ పెద్ద టేబులు చుట్టూ ఎనిమిది కుర్చీలలోనూ ఎనమండుగురు. వాళ్ళు వరుసగా గోవిందయ్య, చంద్రశేఖరం, వీరేశం, మోహనరావు, హరగోపాల్,

నరహరి, రమేష్, శ్రీనివాసరావులు.

జానకి అక్కడికి వచ్చేటప్పటికి గోవిందయ్య గొంతు సవరించుకుని-"మన వీరేశం తమాషాకి బెదిరింపు ఉత్తరం ఒకటి రాశాడు. అది చూడగానే నా గుండె ఆగిపోయింది. చచ్చినంతమాత్రాన మీ స్నేహాన్నెలా వదులుకోగలను? ఒక్కొక్కళ్ళనే నా దగ్గరకు రప్పించుకున్నాను.

మధ్యలో జానకి నా ప్రయత్నాలకు అంతరాయం కలిగించబోయింది. ఆయా మనుషులకు నేనావహించి ఆ ఇబ్బందులు తొలగించుకున్నాను. మోహనరావు భార్య లక్ష్మిని నేనావహించి దస్తూరీ విషయంలో నా భార్యను గజిబిజి చేశాను. చనిపోయేముందు మన స్నేహితులందరికీ గొప్ప గుర్తింపు కలిగించడం కోసం దేశంలోని ప్రముఖ వ్యక్తుల నావహించాను.

మన రమేష్ శ్రీనివాసరావు తొందరపడ్డారు కానీ వాళ్ళకు కూడా దేశంలో మంచి గుర్తింపు లభించినాక నే మరణించి వుండేవారు. చూస్తూ చూస్తూ నా భార్యకు అన్యాయం జరగనిస్తానా? వాళ్ళను కూడా మన దగ్గరకు వెంటనే తీసుకురాక తప్పలేదు. ఇప్పుడు మళ్ళీ మనం ఎనమండుగురం పూర్వంవలెనే కలిసి ఒకే రకం జీవితం అనుభవించవచ్చు—....." అన్నాడు.

"మరి మన కుటుంబాల సంగతి?" అన్నాడు వీరేశం.

"ముందు స్నేహం—తర్వాతనే కుటుంబం అన్నది మన సిద్ధాంతం. మీరు కావాలనుకుంటే మన భార్యలను కూడా తీసుకువద్దాం—" అన్నాడు గోవిందయ్య.

"పాపం-వారికి కూడా ఏదైనా గుర్తింపు లభించేలా చేద్దామా?" అన్నాను నరహరి.

"మీరంతా ఎలా గంటే అలాగే!" అన్నాడు గోవిందయ్య.

జానకి చటుక్కున అక్కడ్నించి పరుగెత్తింది. భయంతో ఆమెకు వళ్ళంతా చెమటలు పట్టింది. ఆమె చటుక్కున పనివాళ్ళుండే గదికివెళ్ళి వాళ్ళను లేపింది. వాళ్ళు మొత్తం ముగ్గురు. ముగ్గురూ లేచారు. జానకికి ముగ్గురు పిల్లలు. వాళ్ళ వయస్సులు పద్దెనిమిది, పదిహేను, పన్నెండు. జానకి వాళ్ళను కూడా లేపింది. తను ఆ గదిలో భర్తతోపాటు చచ్చిపోయిన ఎనమందుగురినీ చూసిన విషయం చెప్పింది.

అంతా అప్పటికప్పుడు ఆ గదిలోకి పరుగెత్తారు. అక్కడ వాళ్ళకేమీ కనిపించలేదు. అప్పుడు జానకి కూడా అక్కడికి వెళ్ళింది. ఆమెకూ ఏమీ కనబడలేదు.

మర్నాడుదయానికి జానకికి వళ్ళు తెలియని జ్వరం వచ్చింది. డాక్టర్ రాగానే పిల్లలాయనకు జరిగింది చెప్పారు. డాక్టరు ఆమెకు ఇంజక్షన్ చేసి ఆమెకు కాస్త తగ్గగానే ఎవరైనా సైకియాట్రిస్టును సంప్రదించడం మంచిదన్నాడు.

నాలుగు రోజుల్లో జానకి కోలుకుంది. సైకియాట్రిస్టు ఆమె యింటికి వచ్చాడు. ఆయన ఆమె చెప్పిందంతా విని-"దెయ్యాలనేవి లేవు. అదంతా మనం కల్పించుకున్న భ్రమ. నువ్వు కూడా అలాంటి భ్రమకేలోనయ్యావు-" అన్నాడు.

"నేను స్పష్టంగా మనుషుల్ని చూశాను. వాళ్ళ మాటలు విన్నాను—అది భ్రమ అని ఎలా అనుకునేది?" అంది జానకి.

"చూడమ్మా! ఆ ఎనమందుగురు స్నేహితుల మనసులూ

విచిత్రమైనవి. పార్టీలో నీ భర్త గోవిందయ్య పోగానే ఏ మూలనో వున్న స్నేహబలం మెదడుమీద విచిత్రంగా తన ప్రభావం చూపించి మిగతావారొక్కొక్కరే మరణించారు. ఒక స్నేహితుడు పోగానే మిగిలిన వారందరికీ ఏ మూలనో మరణవాంఛ ప్రారంభమై జీవితేచ్ఛ నశించింది. అందుకే వారు వరుసగా పార్టీలు చేయడం మానలేదు. చావుకు కూడా భయపడలేదు.

ఇది చాలా విచిత్రమైన కేసు. ఇందులోని మొత్తం రహస్యాన్ని సాధించాలంటే ఎవరికీ సాధ్యంకాక పోవచ్చు. నీ మనసులోనూ ఆ రహస్యం తెలుసుకోవాలన్న కోరిక అంతర్గతంగా వున్నది. నీ కోరిక బలం ఆ భ్రమను సృష్టించింది. నువ్వు చూసేననుకుంటున్నదంతా నీ ఆలోచనా శక్తి ప్రభావం తప్పితే నువ్వేమీ చూడలేదు. ఒక సమస్యకు పరిష్కారం దొరకనప్పుడు మనిషి అతీంద్రియ శక్తులకు అంటగడతాడు. అదే నువ్వూ చేశావు—" అన్నాడు సైకియాట్రిస్టు.

"అదే నిజమైతే—మరి వాళ్ళందరికీ పార్టీ చేయడానికి అనువుగా గుర్తింపులెలా లభించాయి?" అంది జానకి.

"ఏదో ఒక రోజున ఈ ప్రశ్నకు జవాబు చెప్పగలననుకుంటాను. ప్రస్తుతానికి మాత్రం దీనికి నేనేమీ చెప్పలేను—" అన్నాడు సైకియాట్రిస్టు.

జానకి క్రమంగా కోలుకుంది. సుమారు నెలరోజులు గడిచేక ఒక రోజున కొందరు రాజకీయ నాయకులామె యింటికి వచ్చేరు.

"మన పార్టీలో మహిళలు తక్కువగా వున్నారు. వున్నవారిలోనూ ప్రతిభావంతులు తక్కువగా వున్నారు. మీరు విద్యావంతులు. ప్రతిభావంతులు. మిమ్మల్ని రాష్ట్ర

స్థాయిలో పార్టీ కార్యదర్శిగా చేయాలని చాలామంది అభిప్రాయపడుతున్నారు—" అన్నాడాయన.

"పాపం—వారికి కూడా ఏదైనా గుర్తింపు లభించేలా చేద్దామా?" అన్న నరహరి చెయ్యం మాటలు జానకి చెవుల్లో ప్రతిధ్వనించగా ఆమె కెవ్వున కేక పెట్టి— "నాకు పదవులు వద్దు. గుర్తింపు వద్దు. నాకింకా బ్రతకాలని వుంది—" అంది.

ఆమె మాటలకు అర్థం తెలియక వెర్రి ముఖం వేసుకుని చూశాడా రాజకీయనాయకుడు.

—:ఐ పో యి ం ది:—